

డాక్టర్ గజాననకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

## బాధ్యతల స్వీకరణ

ఎదులాపురం,డిసెంబర్ 28: జిల్లా ఎయిడ్స్, లెప్రసీ ఇన్‌చార్జి ప్రోగ్రామ్ అధికారిగా తాంసి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గజాననను నియమిస్తూ డీఎంహెచ్‌వోఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలోని చాంబర్‌లో జిల్లా ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీకాంత్ ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో తాంసి పీహెచ్‌సీ డాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనకు పారామెడికల్ అధికారులు వామన్‌రావు, మధుసూదన్‌రావు, ఎల్టీ రమణాచారి, కార్యాలయ సిబ్బంది అనిల్, రాజశేఖర్, సతీశ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పీఎఫ్ఆర్డీఏ బిల్లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆదిలాబాద్ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్

ఎదులాపురం,డిసెంబర్ 28: పీఎఫ్ఆర్డీఏ బిల్లు వెంటనే రద్దుచేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆదిలాబాద్ జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ డిమాండ్ చేశారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సమీర్ భట్టాచార్య మంచ్‌లో జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశాలలో భాగంగానే మొదటి రోజు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లడుతూ. పీఎఫ్ఆర్డీఏ బిల్లు రద్దుతో పాటు ఆదాయపు పన్ను పరిధి పెంపు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

బోథ్, డిసెంబర్ 28: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. ఆదిలాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. బోథ్ నుంచి తరలి పోయిన కార్యాలయాల వివరాలు, భవనాల దుస్థితి గురించి జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ప్రచార సభలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో6 రేవంత్‌రెడ్డి రెవెన్యూ డివిజన్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కే మహేందర్, షేక్ అబూద్, గట్ల గంగాధర్, వి రాజశేఖర్ ఉన్నారు.

## మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు

ఇంద్రవెల్లి, డిసెంబర్28: మండలంలోని కెస్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కెస్లాగూడ(ఎం)గ్రామంలో మిషన్ భగీరథ పథకం పైపులైన్లకు గ్రామపంచాయతీ సిబ్బంది గురువారం మరమ్మతులు చేశారు. కెస్లాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మెస్రం రేణుకానాగ్‌నాథ్ ఆధ్వర్యంలో కెస్లాగూడ(ఎం)గ్రామంలో లికేజీలను వెతికి వాటికి మరమ్మతులు చేశారు. గ్రామంలో జీపీ ట్రాక్టర్‌తో చెత్తను తొలగించి రోడ్లతోపాటు వీధులను శుభ్రం చేశారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బోథ్, డిసెంబర్ 28: బోథ్‌లో కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సల్ల రవి జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని నెరవేరుస్తుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్, నాజర్ అహ్మద్, వినయ్‌రెడ్డి, అబ్రార్, అరుణ్‌రెడ్డి, రహీం, యూసుఫ్, రాయల్, తిరుపతి పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో ఎమ్మెల్యేకు చికిత్స

ఎదులాపురం/ఉట్నూర్, డిసెంబర్ 28: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జ్వరంతో బాధపడుతూ ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందారు. మళ్లీ గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు. వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు వివరించారు.

## రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు

తాంసి, డిసెంబర్ 28: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలకు రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. రేషన్ కార్డు దరఖాస్తు చేసుకునేవారు తెల్ల కాగితంపైన దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. నేడు సవర్గాం, గిరిగాం గ్రామాల్లో ప్రజా పరిపాలన కార్యక్రమం ఉంటుందని, ఎంపీడీవో ఆకుల భూమయ్య కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ల నియామకం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఉట్నూర్/ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 28: జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా మత్స్య పారిశ్రా మిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో మండలంలోని మత్తడిగూడ గ్రామానికి చెందిన సిడాం సోనేరావు, బిర్సాయిపేట్ గ్రామానికి చెందిన లక్ష్మి, బోయవాడకు చెందిన గుమ్ముల భీమన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు మత్స్యశాఖ ఎఫ్‌డీవో సాంబ శివరావు శాలువాలతో సన్మానించారు. మత్స్య పారిశ్రామిక సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. సంఘ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

## రేపు కదిలి ఆలయం వద్ద కొబ్బరి కాయల వేలం

దిలావర్‌పూర్ డిసెంబర్ 28: మండలంలోని ప్రసిద్ధ దేవాలయమైన శ్రీ కదిలి పాపహరేశ్వర ఆలయం వద్ద ఈ నెల 30న బహిరంగ కొబ్బరి కాయలు, ఇతర పూజా సామాగ్రి కోసం వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్ గౌడ్ తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఆలయ వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు రూ. 50 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

## వచ్చే నెల 3న సదర్మాట్ ఆయకట్టు నీటి విడుదల

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 28 : వచ్చే నెల జనవరి 3న సదర్మాట్ ఆయకట్టు కాలువ నీటిని విడుదల చేస్తున్నట్లు మిషన్ కాకతీయ ఎస్ఈ సుశీల్ కుమార్, ఈఈ రామారావు పేర్కొన్నారు. రైతులు తమ తమ వ్యవసాయ క్షేత్రాల్లో యాసంగి పంటలకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సుమారు 13 వేల ఎకరాల పంటకు సాగు నీరు అందిస్తున్నట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

# ప్రజా పాలనకు ఇబ్బందులుండొద్దు

- ఆదిలాబాద్ జడ్పీ సీఈవో గణపతి
- జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు



గుడిహత్నూర్: గర్కంపేటలో దరఖాస్తును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో గణపతి

గుడిహత్నూర్,డిసెంబర్ 28: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ జడ్పీ సీఈవో గణపతి అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని గర్కంపేట్‌లో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని దరఖాస్తుల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా పూర్తి సమాచారంతో ఫారాలు నింపాలని, దరఖాస్తుదారుడికి రసీదు ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో బీ అరుణ, మండల వ్యవసాయాధికారి డీ రేవతి, ఈవోపీఆర్డీ లింగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీడీ ప్రేమ్‌నివాస్, ఏఈవో శ్రీధర్, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు. మండల ంలోని బెల్లూరి, గోండ్ హర్కాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ కవితారెడ్డి ఆధ్వర్యంలో ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.

### అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

బోథ్, డిసెంబర్ 28: ఆరు గ్యారంటీల పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బోథ్ ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్‌చందర్ సూచించారు. మండలంలోని అందూర్, మందబొగుడ, బిర్లగొంది, నాగాపూర్, కేశవ్‌గూడ, వజ్జర్ గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో సీఎం సందేశం చదివి వినిపించాక దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచులు అంగూరిబాయి, సుమిత్ర, చాంగుబాయి, శిరీష ఉన్నారు.

### నార్నూర్ మండలంలో..

నార్నూర్, డిసెంబర్ 28:ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారులు భిక్షపతిగౌడ్ ,ఏడీఏ రాథోడ్ గణేశ్ అన్నారు. గురువారం ఉమ్మడి మండలంలోని జామడ, గంగాపూర్, మాన్కాపూర్, గుంజాల, ఖడ్కి, రోమాన్‌కాసా, ఆదిమ్యాన్, ఖడోడి పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. దరఖాస్తు పూరించే విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో పూర్తి చేసేందుకు ఇబ్బంది పడ్డారు. అయితే ఆన్‌లైన్ సెంటర్ల వద్ద ఒక్క ఫారానికి రూ.20, ఆధార్, రేషన్‌కార్డుతో పాటు ఇతర పత్రాల జిరాక్స్‌ల కోసం సుమారు రూ.వంద వరకు డబ్బులు కట్టాల్సి వస్తున్నది. కార్యక్రమంలో ఎంపీడీవో కావల రమేశ్,తహసీల్దార్ జాడి రాజలింగం, ఏవో గిత్తే రమేశ్, జాడి దివ్య, ఎంపీవో సాయిప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, డిసెంబర్28: మండలంలోని పిప్రి, తేజాపూర్, ఘట్టేపల్లి, ఈశ్వర్‌నగర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలనలో భాగంగా గ్రామాల ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీల కోసం ప్రజలు విడివిడగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు ఎంపీవో సంతోష్‌కుమార్, ఏపీఎం రాథోడ్ రామారావ్, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### భీంపూర్ మండలంలో..

భీంపూర్, డిసెంబర్ 28: భీంపూర్ మండల సరిహద్దు గ్రామాలు గుబిడి, టేకిడిరాంపూర్ సహ జలకొరి, గుబిడిపల్లిల లో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక యువకులు దరఖాస్తులు రాసిస్తూ గ్రామస్తులకు సహకరించారు. జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీపీ కుడిమెత రత్నప్రభ, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వినోద్, వైద్య సిబ్బంది నిఖిల్‌రాజ్, జ్ఞానేశ్వర్, గంగాధర్, ఆర్ఐలు అశోక్, శారద, సర్పంచులు ఎల్పుల ప్రతాప్‌యాదవ్, కుడిమెత రేఖ, నక్కలక్ష్మి , మడావి అనిల్, కార్యదర్శులు నితిన్,నర్సయ్య, సాయి , సాయినందన, ఎస్ఐ లాల్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ప్రజాపాలన గ్రామసభలు**

భీంపూర్ మండలంలోని గోముత్రి, అంతర్గాం, అందర్‌బంద్, కైరిగూడ గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

బజార్‌హత్నూర్, డిసెంబర్ 28: మండలంలోని డేడ్రా, మన్కాపూర్, రాంపూర్, బోస్రా గ్రామాల్లో తహసీల్దార్ శంకర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల సమక్షంలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. అంతకుముందు రాంపూర్ గ్రామంలో తహసీల్దార్ శంకర్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. సరైన క్రమంలో పూర్తి వివరాలను నింపాలని సూచించారు. ఈ కార్యాక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఎస్ఐ నరేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాంసి, డిసెంబర్ 28: మండలంలోని వడ్డాడి, లింగూడ గ్రామాల్లో గురువారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. జడ్పీటీసీ రాజు మాట్లాడుతూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 28: సంక్షేమ పథకాల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోవాలని సిరికొండ మండల ప్రత్యేకాధికారి నర్సింగ్ సూచించారు. మండల కేంద్రంతో పాటు, వాయిపేట్‌లో ప్రజా పాలన కార్యక్రమం గురువారం ప్రారంభించారు. మండల కేంద్రంలో 300 దరఖాస్తులు, వాయిపేట్‌లో 120 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సురేశ్, తహసీల్దార్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సిరికొండ, వాయిపేట్ సర్పంచ్‌లు నర్మద, పెందూర్ లక్ష్మి, ఎంపీపీ అమృత్‌రావ్, ఎస్ఐ శ్రీకాంత్, ఎంపీవో అతుల్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్చోడ మండలంలోని మాదాపూర్, దుబార్ పేట్(ఏ) గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ తుకారాం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుబార్ పేట్(ఏ) సర్పంచ్ అభినయ్, ఆర్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

### ఆదిలాబాద్ పట్టణంలో..

ఎదులాపురం, డిసెంబర్ 28: ఆదిలాబాద్ పట్టణంలోని 49వార్డుల్లో కౌన్సిలర్లు, వార్డు అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 28: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచకంటి, దిమ్మ గ్రామాల్లో గురువారం ప్రజా పాలన అభయ హస్తం దరఖాస్తులను ఎంపీపీ గంద్రత్ రమేశ్ స్వీకరించారు. జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని రణదివేనగర్, గాంధీ నగర్‌లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు కొండ గణేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఉట్నూర్ మండలంలో..

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 28: దరఖాస్తు స్వీకరణలో అలసత్యం వద్దని అధికారులకు ఆర్డీవో జివాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సర్పంచ్ పంద్ర లత, ఎంపీడీవో తిరుమల, పంచాయతీ కార్యదర్శి కిరణ్, విద్యుత్ ఏఈ శ్రావణ్‌కుమార్, ఈజీఎస్ టీఏ మల్లేశ్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జైనథ్(బేల), డిసెంబర్ 28: బేల మండలంలోని భవానీగూడ(సీ) గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎంపీపీ వనితా గంభీర్ ఠాక్రే, బేల జడ్పీటీసీ అక్షితా సతీశ్ పవార్ హాజరై ప్రారంభించారు. సర్పంచ్ కేశవ్, ఉప సర్పంచ్ పోతా, ప్రత్యేకాధికారి శంకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### నేరడిగొండ మండలంలో..

నేరడిగొండ, డిసెంబర్ 28: మండలంలోని లింగట్ల, ఆరెపల్లి, కొర్టికల్ కె, కొర్టికల్ బి, నారాయణపూర్, వాంకిడి గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపూర్ గ్రామంలో ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రారంభించారు. ఆరెపల్లిలో 110, కొర్టికల్ కే లో 69, కొర్టికల్ బీ లో 75, నారాయణపూర్‌లో 129, వాంకిడిలో 151, లింగట్లలో 155 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ రూరల్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో జివాకర్ రెడ్డి



ఆదిలాబాద్ రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



తాంసి: దరఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీటీసీ , తహసీల్దార్

# మెరుగైన వైద్య సేవలందించాలి

- అడిషనల్ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు




హీరాపూర్‌లో వైద్య శిబిరాన్ని సందర్శించిన అడిషనల్ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు

నార్నూర్, డిసెంబర్ 28: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలని అడిషనల్ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు వైద్యసిబ్బందికి సూచించారు. గాదిగూడ మండలం పర్సువాడ(బీ)పంచాయతీ పరిధిలోని హీరాపూర్ గ్రామంలో గురువారం మొబైల్ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో సందర్శించారు. ప్రజలకు సేవలు అందిస్తున్న తీరును పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యాధుల నివారణకు గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని, మారుమూల ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లయితే గుర్తించి వారికి చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, హెచ్ఈవో పవార్ రవీందర్, సిబ్బంది ఉన్నారు.

# సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 28: స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో అమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమన్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షులు అర్బాత్ ఖాన్, పరమేశ్వర్ కోల్టక్కర్, షేక్ కలీం, రాహుల్ గజ్బరే, షేక్ అజీమ్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



చెక్కు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గొర్ల సురేందర్ యాదవ్

## బాధిత కుటుంబానికి భరోసా చెక్కు అందజేత

బోథ్, డిసెంబర్ 28: బోథ్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్ల ఆధ్వర్యంలో న వీన్‌కుమార్ కుటుంబ సభ్యులకు గురువారం కుటుంబ భరోసా రూ.1,50,000 చెక్కును సర్పంచ్ గొర్ల సురేందర్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరికంటి మహేశ్, మండలాధ్యక్షుడు కడెరుగుల గణేశ్, ప్రధాన కార్యదర్శి ముక్కాల రాజేశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీరామ్ విజయ్, కోశాధికారి నోముల కుశాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సుస్థిర జీవనం అలవర్చుకోవాలి

- జిల్లా విద్యాధికారి ప్రణీత
- ఎన్జీసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 28: విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానం అలవర్చుకోవాలని, డీఈవో ప్రణీత, నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్ట్ అధికారి బీ.విద్యాసాగర్ సూచించారు. స్థానిక లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో ఎన్జీసీ ఆధ్వర్యంలో గురువారం సుస్థిర జీవన విధానంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి టీ.ప్రణీత మాట్లాడుతూ దైనందిన జీవి తంలో మనం చేస్తున్న పొరపాట్లు అలవాట్లతో ప్రకృతి దెబ్బతింటుందని కాలుష్యం పెరుగుతుందన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చెత్త నిర్వహణ కంపోస్టు ఎరువుల తయారీ, కాలుష్య విధానాన్ని చిన్న చిన్న ప్రయోగాలతో ప్రత్యక్షంగా వివరించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. స్టేట్ రిసోర్స్ పర్సన్స్ మేజర్ శివ కిరణ్, ఈ వెంకటేశ్వర్లు, ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త కంటె నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి కే రఘు రమణ, అకడమిక్ కోఆర్డినేటర్ ఆరె భాస్కర్, సెక్టోరియల్ అధికారులు నారాయణ, సుజాత్ ఖాన్, ప్రిన్సిపాల్ దేవేందర్ పటాస్కర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 28: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సరస్వతీ నగర్ బాలికల పాఠశాలను డీఈవో ప్రణీత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగ తి పరీక్షల్లో మంచి మార్కులు రావడానికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, హెచ్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



సన్మానిస్తున్న అధికారులు

## స్వచ్ఛంద సంస్థల సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 28: జిల్లా మహిళా, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులైన శశికళ, సురేశ్, నిఖిల్, ఆదిత్యను అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతే, జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, డీఆర్డీవో కిషన్, పీడబ్ల్యూవో మిల్క సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## స్థలం కేటాయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

బోథ్, డిసెంబర్ 28: బోథ్ మండలకేంద్రంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని గురువారం సర్పంచ్ జీ సురేందర్ యాదవ్‌కు ఫొటోగ్రాఫర్లు వినతి పత్రం అందజేశారు. అనువైన స్థలాన్ని గుర్తించి కేటాయించేలా చూస్తామని ఆయన వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## ఒకరి కోసం గాలింపు

ఇంద్రవెల్లి, డిసెంబర్28: మండలోని కొబ్బాయిగూడ గ్రామ సమీపంలోని చెరువులో ఈ నెల 26న అదృశ్యమైన గారుశే నాందేవ్ కోసం పోలీసుల ఆధ్వర్యంలో గురువారం గాలింపు చర్యలు చేపట్టారు. అంజి గ్రామానికి చెందిన రమేశ్, మారుతి, దిగంబర్ అందించిన సమాచారం మేరకు చెరువు ఒడ్డుపై నాందేవ్‌కు చెందిన చెప్పులు, బట్టలను గుర్తించారు. ఉట్నూర్‌కు చెందిన గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు సాయంత్రం వరకు కొనసాగాయి. అయితే ఇప్పటివరకు ఆచూకీ లభించలేదని ఏఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ డీ సునీల్ చెరువును పరిశీలించారు.